

కలెక్టరేట్‌లో అమరులకు నివాళి
సిరిసిల్ల: కలెక్టరేట్‌లో గురువారం అమరులకు నివాళి అర్పించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్లు ఉన్నారు.



రాజన్న సేవలో..
వేములవాడ: రాజన్నను శృంగేరి శివగంగ జగద్గురు పురుషోత్తమ భారతీస్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్, అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.0/28.0
ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పనులు త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాలఠాణా గ్రామం పక్కన ప్రభుత్వం కోతుల కాలనీవాసుల కోసం నిర్మిస్తున్న 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ గురువారం పరిశీలించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నీటి సదుపాయలు, డ్రెయినేజీ నిర్మాణాలు, విద్యుత్ కనెక్షన్‌లను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, తహసీల్దార్ రాజు ఉన్నారు.

రాష్ట్రంలో రాచరిక పాలన



వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఒకే కుటుంబం రాచరికపు పాలన సాగిస్తోందని, ఈ పాలనకు అంతం పలికే రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

శివంగాలపల్లిలో ఎలుగుబంటి సంచారం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లిలో మూడు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శివంగాలపల్లి శివారులోని సమ్మక్క–సారక్క ఆలయ ప్రాంతానికి వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళల్లో గ్రామ శివారులోకి వస్తున్న ఎలుగుబంటి ఇళ్ల వద్దకు వచ్చి నీరు తాగి వెళ్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ సురేశ్‌యాదవ్ అటవీశాఖ అధికారులకు తెలిపారు. సెక్షన్ అధికారి బాపురాజును వివరణ కోరగా శివంగాలపల్లి ప్రాంతంలో నాలుగు ఎలుగుబంట్లు ఉన్నాయని, అందులో ఒకటి తప్పిపోయి గ్రామంలోకి వస్తుందని తెలిపారు. రాత్రి వేళల్లో ఒక్కరు బయటకు వెళ్లవద్దని.. నలుగైదుగురు కలిసి వెళ్లాలని సూచించారు.

ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌నకు ఎంపిక



సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలలో ప్రతిభ చాటారు. విద్యార్థులు సమర్థ, సహస్ర, శ్రీనిధి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరి ప్రతిభకు మరింత పదును పెట్టి జాతీయస్థాయిలో రాణించేందుకు వరంగల్‌లోని నీట్‌లో గురువారం నుంచి జరిగే వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. నీట్ ప్రొఫెసర్లు రామచంద్రయ్య, లక్ష్మారెడ్డి, సంపత్‌కుమార్, ఆంజనేయులు, సురేష్‌బాబు విద్యార్థులకు మెలకువలు నేర్పారు. విద్యార్థుల వెంట గైడ్ టీచర్లు దొర్నాల భూపాల్‌రెడ్డి, మహేశ్, చంద్ర, కిషన్, సంపత్ సైతం వెళ్లారు.

పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేత



ట్యాబ్‌లు అందిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంతోపాటు తంగళ్లపల్లి మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు యూడైస్ ఎంట్రీ, ఎఫ్ఎల్ఎన్, ఎంఎంబీ, ఎండీఎం వివరాల అప్‌డేట్ చేయడానికి అవసరమైన ట్యాబ్స్‌ను గురువారం డీఈవో రమేశ్ అందజేశారు. 2022–23 విద్యాసంవత్సరం చైల్డ్‌ఇన్ఫో డేటా ప్రకారం విద్యార్థుల సంఖ్య 10 కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు మాత్రమే ట్యాబ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు శైలజ, పద్మజ, విద్యాసాగర్, వెంకన్న, సిరిసిల్ల, తంగళ్లపల్లి పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పప్పులు పిరమే..



కిరాణ దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పప్పుదినుసులు

పప్పుల ధరలు ఇలా..
(కిలోకు రూ.లలో..)

రకం	గతం	ప్రస్తుతం
కంది	రూ.120	రూ.150
పెసరపప్పు	రూ.105	రూ.120
గుండు మినుము	రూ.120	రూ.150
శనగపప్పు	రూ.63	రూ.80
మైసూరుపప్పు	రూ.78	రూ.100

- రెండు నెలల్లో కిలోకు రూ.30 పెరుగుదల
- తగ్గిన దిగుబడితో కొరత
- మహారాష్ట్ర నుంచి దిగుమతితో అదనపు భారం
- స్థానిక ట్రేడర్ల మాయాజాలంతో ధరల్లో పెరుగుదల



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ కుర్ర బాలమణి. ఎల్లారెడ్డిపేటకు చెందిన బాలమణి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ప్రతీ నెల నిత్యావసర సరుకులు పరిమితంగా కొంటుంటుంది. నిత్యం కూలీ పనులు చేస్తేనే కుటుంబం ముందుకు సాగుతోంది. అమాంతంగా పెరిగిన పప్పు దినుసుల ధరలతో పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల వ్యవధిలోనే పప్పుల ధరలు కిలోకు రూ.10 నుంచి రూ.30 వరకు పెరగడంతో కొనలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న కందుకూరి నవీన్ ఎల్లారెడ్డిపేటలో హోటల్ నిర్వహిస్తుంటాడు. పప్పుల ధరలు పెరగడంతో హోటల్ నడపడం ఇబ్బందిగా మారిందంటున్నాడు. పెరిగిన ధరలకు అనుగుణంగా టిఫిన్స్ ధరలు పెంచలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. హోటల్‌లో ప్రతీ వస్తువును పప్పులతోనే తయారు చేయడం కాబట్టి పెరిగిన ధరలతో ఇబ్బందిగా మారిందంటున్నాడు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పప్పుల ధరలు ఎన్నడూ లేనంత పిరమైనయి. స్థానికంగా పప్పుదినుసుల ఉత్పత్తి లేకపోవడం.. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. రెండు నెలల్లోనే కిలోకు రూ.10 నుంచి రూ.30 పెరిగాయి. అమాంతం పెరిగిన ధరలతో సామాన్యులు పప్పులు కొనడం తగ్గించారు. ఇటు పప్పుల ధరలు పెరగడం.. అటు చికెన్ ధర కూడా రూ.300 దాటడంతో ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతీ నెల రూ.2కోట్ల వ్యాపారం

జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు సిరిసిల్ల, వేములవాడను కలుపుకొని 13 మండలాల్లో ప్రతీ నెల రూ.2 కోట్ల వరకు పప్పుల వ్యాపారం జరుగుతోంది. ప్రతీ ఒక్కరికి ఉదయం లేస్తేనే ప్రధానంగా అవసరపడే వివిధ రకాల పప్పు దినుసుల ధరలు ఆకాశాన్ని చేరాయి. మహారాష్ట్రలోని అకోల పట్టణంలోని వ్యాపారులు పప్పులను బ్లాక్ చేయడంతోనే ధరలు పెరిగాయని స్థానిక హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. ఇక్కడి ట్రేడర్లు సైతం పెరుగుతున్న ధరలను ఆసరా చేసుకొని ధరల్లో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పప్పుల ధరలు అమాంతం పెరిగాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఒక్కో కిలోపై రూ.10 నుంచి రూ.30 పెరిగాయి.

పంటల సాగుపై అవగాహన కరువు

జిల్లాలోని రైతులకు పప్పుదినుసుల పంటలను సాగు చేయాలనే దానిపై అవగాహన కరువైంది. వ్యవసాయాధికారులు అవగాహన కల్పించకపోవడంతో రైతులకు పెద్దగా తెలియదు. రానున్న రోజుల్లో ఇంకా ధరలు పెరిగితే సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడుతుంది. వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన పప్పు దినుసుల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మన ప్రాంతంలో ఈ పంటలు సాగుచేస్తే ధరలు అందరికీ అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి.

పెరుగుతున్న ధరలతో ఇబ్బంది



పప్పుల ధరలు రోజురోజుకు పెరగడంతో వినియోగదారులకు ఎలా అమ్మాలో తెలియడం లేదు. పెరుగుతున్న ధరలతో పప్పులు అమ్మడం ఇబ్బందిగా మారింది. పప్పులు మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతున్నాయి. – దేవేందర్, వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

రైతులకు అవగాహన కల్పిస్తాం



వరికి బదులుగా ఆరుతడి పంటలు పండించాలని ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పప్పుదినుసు పంటల సాగుకు పెట్టుబడులు కూడా తక్కువగా ఉంటాయి. మార్కెట్‌లో పంటకు డిమాండ్ ఉంటుంది. తక్కువ ఖర్చు, నీటి వినియోగం కూడా తక్కువగా ఉంటుంది. రైతులు ఈ పంటల సాగుపై దృష్టి పెట్టాలి. – చాద భూంరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

రేపు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



సిరిసిల్ల: వర్షాకాలం కరిగిపోతోంది. కార్తెలు వెళ్లిపోతున్నాయి. వానాకాలంలో జిల్లాలో చినుకు జాడలేదు. రైతులు ఇప్పుడిప్పుడే నార్లు పోస్తున్నారు. ఎండలు మండిపోతున్నాయి. రేగడి భూముల్లో విత్తిన పత్తివిత్తనాలు వట్టిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ వానాకాలం వ్యవసాయానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి విత్తనాలను ఎంచుకోవాలి. వర్షాలు ఆలస్యమైతే ఏ పంటలు వేసుకోవాలి. జిల్లా రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి? జిల్లాలో ఎరువులు, విత్తనాల సరఫరా ఎలా ఉంది.. అనే అంశాలతోపాటు రైతులకు వచ్చే సందేహాలకు సమాధానం ఇచ్చేందుకు జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తుంది. రైతుల సందేహాలకు జిల్లా వ్యవసాయాధికారి సమాధానాలు ఇస్తారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

రోజు : జూన్ 24(శనివారం)
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటలు
ఫోన్ నంబర్ : 72888 94142

నేతన్నల సంక్షేమానికి బాసట

- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- నేత కార్మికులకు సన్మానం



కార్మికురాలిని సన్మానిస్తున్న టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జౌళిశాఖ కమిషనర్ బుద్ధ ప్రకాశ్

సిరిసిల్ల: నేతకార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తుందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం హైదరాబాద్ జౌళిశాఖ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా నేతన్నకు చేయూత, చేనేతమిత్ర, నేతన్నలకు బీమా పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లను నేతన్నలకు అందిస్తూ మెరుగైన జీతాలు లభించేలా చర్యలు తీసుకుందన్నారు. సిరిసిల్లకు చెందిన నలుగురు నేతకార్మికులను సన్మానించారు. జౌళిశాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, టెస్కో జీఎం యాదగిరి, రతన్, జౌళిశాఖ డీడీ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం



అమరులకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, సిబ్బంది

ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళి అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. స్వరాష్ట్రం సిద్ధించడం సంతోషదాయకమని, ఇక అభివృద్ధిలో మమేకమవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులకు విరిగిన స్తంభం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లిలోని హైస్కూల్ పరిసరాల్లో ఓ సిమెంట్ బ్రిక్స్ షాపు వద్ద వేపచెట్టు మండ విరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో తీగలు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గురువారం వేకువజామున వీచిన బలమైన ఈదురుగాలులకు ఓ పెద్ద వేపచెట్టు మండ విరిగి స్తంభంపై పడడంతో వేకువజామున 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



చెట్టు మండ పడడంతో విరిగిన పోల్, తెగిన వైర్లు

ప్రాణాలు 'ఆటో'.. ఇటో

సిరిసిల్ల: ప్రమాదమని తెలిసినా.. కూలీ పనుల కోసం.. ఫంక్షన్‌లకు ఇలా వెళ్తున్నారు. ఒక్కో ప్యాసింజర్ ఆటోలో తక్కువకు తక్కువగా 15 మందికి పైగానే వెళ్తూ కనిపిస్తున్నారు. జిల్లాలో వాహనాల తనిఖీలు లేక ఓవర్‌లోడ్ ప్రయాణాలు అధికమయ్యాయి. సిరిసిల్ల–వేములవాడ మధ్య అగ్రహారం వద్ద ఆటో నిండా ప్రయాణిస్తూ.. ఇలా వెనక వైపు కూడా నలుగురు కూర్చుని వెళ్తూ కనిపించారు. ఆటో అదుపు తప్పితే పరిస్థితి ఏంటి.. అనేది కూడా వారు ఆలోచించినట్టు లేరు. పోలీసులు ఓవర్‌లోడ్‌పై దృష్టి పెడితే ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టాన్ని తగ్గించిన వారవుతారు.



అమరుల త్యాగఫలమే తెలంగాణ

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్
- సిరిసిల్లలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి
- అమరుల కుటుంబాలకు సన్మానం
- కలెక్టరేట్‌లో సహపంక్తి భోజనం



సిరిసిల్లలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



వేములవాడలో నివాళి అర్పిస్తున్న నాయకులు



తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం



నివాళి అర్పిస్తున్న సిరిసిల్ల నాయకులు

సిరిసిల్ల: అమరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం స్థానిక పాతబస్టాండు సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి రాష్ట్రాన్ని రాజ్యాంగ పద్ధతుల్లో సాధించారన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు అన్ని రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కరెంట్, సాగునీరు, రోడ్లు, సంక్షేమ పథకాల్లో దేశానికి దిక్సూచిగా తెలంగాణ మారిందని పేర్కొన్నారు. నేటితరం పిల్లలకు గతంలో పడిన కష్టాలను వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రం రాక ముందున్న పరిస్థితులు.. ఇప్పుడున్న పరిస్థితులను ప్రజలు ఆలోచించాలని కోరారు. అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర సాధన ఉద్యమకారులను సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, తెలంగాణ సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పార్టీ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, అగ్గి రాములు పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు సన్మానం

కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో అమరులైన 30 మంది కుటుంబ సభ్యులను సన్మానించారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని వక్తలు వివరించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల శివారులో బుధవారం బస్సు బోల్తాపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ఓరుగంటి ఆనంద్, జక్కుల నాగరాజుయాదవ్ జిల్లా ఆస్పత్రిలో గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావుకు సూచించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు.

సిరిసిల్లటౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం నుంచి స్థానిక అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ తీశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల పునాదులపై స్వరాష్ట్రం

వేములవాడ: అమరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద గురువారం నివాళి అర్పించారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్‌తోపాటు చాలా మంది తెలంగాణ ఉద్యమనేతలు కేసీఆర్ నాయకత్వంలో పోరాడారని గుర్తు చేసుకున్నారు. పోరాటాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ అభివృద్ధి పరుస్తున్నారన్నారు. తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగిందన్నారు. తెలంగాణ రాకముందు వేములవాడలో తాగుదామంటే నీళ్లు దొరకని దుస్థితి నుంచి.. ప్రస్తుతం ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకే పరిస్థితికి వచ్చామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్‌రావు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, జడల లక్ష్మి, బింగి మహేశ్, గోలి మహేశ్, జోగిని శంకర్, మారం కుమార్, నాయకులు పుల్కం రాజు, గోస్కుల రవి, పొలాస నరేందర్, రాజు, గడ్డం హన్మండ్లు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న స్ఫూర్తి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన గుర్రాల స్ఫూర్తికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీఈవో రమేశ్‌కుమార్ మెమోంటో, ప్రశంసాపత్రం అందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. స్ఫూర్తిని సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ అభినందించారు.

నవోదయకు ఎంపిక



నవోదయకు ఎంపికైన సాయినిత్యను సన్మానిస్తున్న సర్పంచ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని బావుసాయిపేటకు చెందిన మాలోత్ సాయి నిత్య జవహర్ నవోదయకు ఎంపికైంది. గ్రామానికి చెందిన విద్యార్థిని స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతూ ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాసింది. గురువారం ఫలితాలు రావడంతో ఎంపికైనట్లు తెలిసింది. సర్పంచ్ కెంద గంగాధర్, ఉపసర్పంచ్ చొక్కాల దేవరాజు, ఎంపీటీసీ యాస్మిన్ పాషా, కరస్పాండెంట్ గంగిశెట్టి మునీందర్ పాల్గొన్నారు.

అమరులకు కొవ్వొత్తులతో నివాళి



వేములవాడ: తెలంగాణ అమరులకు వేములవాడ జర్నలిస్టులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పాపన్నచౌక్ నుంచి బైక్‌లపై ర్యాలీగా అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. జర్నలిస్టు సంఘం నాయకులు సయ్యద్ లాయక్‌పాషా, కొలిపాక నర్సయ్య, జితేందర్, రేగుల రాము, అజీమ్‌తో పాటు మరో 20 మంది పాల్గొన్నారు.

సంకెపల్లి ఎల్లమ్మ గుడిలో చోరీ



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఆలయంలోని హుండీని బయటకు తీసుకెళ్లి నగదు తీసుకుని హుండీని ఆలయ పరిసరాలలో పడేశారు. ఇటీవల ఎల్లమ్మ సిద్ధోగం జరిగిందని అందులో భారీ మొత్తంలో నగదు ఉందని గౌడ కులస్తులు పేర్కొంటున్నారు. దొంగలను పట్టుకోవాలని కోరుతూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు.

రైతుబంధు రెడీ

- వానాకాలం సీజన్‌కు రూ.131 కోట్లు
- జిల్లాలో 1.30 లక్షల రైతులు అర్హులు
- కొత్తగా 8 వేల మందికి లబ్ధి



దుక్కి దున్నుతున్న రైతన్న

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్ర ప్రభుత్వం పంటలకు సాగుకు రైతులకు అందజేస్తున్న పెట్టుబడి సాయం బడ్జెట్ విడుదలైంది. రైతుబంధు కింద ఈ సీజన్‌లో జిల్లాలో 1,30,954 మంది రైతులకు రూ.131,03,40,247 మంజూరయ్యాయి. మరి కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. ఈమేరకు వ్యవసాయాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎకరాకు రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు పెట్టుబడి సాయం కింద రైతులకు డబ్బులు అందిస్తున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతుల బిజీ

వేసవి ముగిసినప్పటికీ ఎండలు ఇంకా దంచి కొడుతున్నాయి. అయినప్పటికీ రైతులు వానాకాలం సీజన్ పనులు ప్రారంభించారు. పలువురు రైతులు దుక్కి దున్ని పెట్టారు. వర్షాలు కురవక ముందే మెజార్టీ రైతులు తమ చేలలో పత్తి విత్తనాలు నాటి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. బావుల కింద ఇప్పటికే నార్లు పోశారు. ఈ వానాకాలంలో 1.40 లక్షల ఎకరాల మేర వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారుల అంచనా.

రైతులకు అండగా సాయం



మాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. ప్రతీ సీజన్‌లో పంటల సాగు ముందు వచ్చే రైతబంధు పెట్టుబడిసాయం ఎంతో సహాయంగా ఉంది. ప్రతీ సీజన్‌లో పెట్టుబడిసాయం సుమారు రూ.13 వేల వరకు వస్తుంది. పొలం పనులు మొదలయ్యాయి.

– ఎమిరెడ్డి సురేందర్‌రెడ్డి, రైతు, దేశాయిపల్లి

పది వేల మంది రైతులకు లబ్ధి



మండలంలోని 23 గ్రామాల్లో 10,816 మంది రైతులు ఉన్నారు. వారికి వానా కాలం సీజన్‌లో రూ.11 కోట్లకుపైగా రైతుబంధు పెట్టుబడి సాయం డబ్బులు మరి కొద్ది రోజుల్లో వారి ఖాతాల్లో జమకానున్నాయి. గతంలో రైతులు పొలం పనుల ఖర్చులకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు.

– పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీపీ, బోయినపల్లి

కొత్తగా 8 వేల మందికి..



వానాకాలం సీజన్‌లో జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయం రూ.131 కోట్లకు పైగా మంజూరైంది. 1,34,954 మంది రైతుబంధుకు అర్హులు ఉన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో కొత్తగా 8,062 మంది రైతులు లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. రెండు సీజన్లలో సీజన్‌కు ఎకరాకు రూ.5వేలు పెట్టుబడి సాయం రైతులకు అందుతుంది.

– భాస్కర్,ఇన్‌చార్జి డీఏవో, సిరిసిల్ల

ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు



లారీని అడ్డుకున్న మర్తనపేట గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మర్తనపేటలో ఇసుక లారీలను స్థానికులు గురువారం అడ్డుకున్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేట ఇసుక రీచ్ నుంచి లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మర్తనపేట వద్ద అడ్డుకుని ఆందోళన చేశారు. స్థానిక అవసరాలకు ఇసుక ఇవ్వకుండా వేరే జిల్లాకు ఎలా తరలిస్తున్నారని ప్రశ్నించారు. మొదట స్థానిక అవసరాలకు ఇసుకను అందించాలని మాజీ వైస్‌ఎంపీపీ గంగుల ఎల్లయ్య, రైతులు ఏసె దేవయ్య, శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. మైనింగ్ వాళ్ల అనుమతితో ఇసుకను తరలిస్తున్నారని తహసీల్దార్ రవికాంత్ పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని కొండాపూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునీందర్ హెచ్చరించారు. ముస్తాబాద్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. కొండాపూర్ మానేరువాగు నుంచి ఎల్లారెడ్డిపేటకు చెందిన వారు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని తెలిసిందన్నారు. ఎల్లారెడ్డిపేట సరిహద్దు గ్రామాల వారు కొండాపూర్ పరిధిలోకి వచ్చి ఇసుకను తీసుకెళ్లరాదని సూచించారు.

భూ కబ్జాపై చర్యలు తీసుకోవాలి



న్యాయం చేయాలని కోరుతున్న కుటుంబం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో తమ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మద్దుల ఎల్లారెడ్డి కుటుంబీకులు గురువారం అధికారులకు విన్నవించారు. బాధితులు మాట్లాడుతూ సిరిసిల్ల, కామారెడ్డి ప్రధాన రహదారిపై 7.25 ఎకరాల భూమి ఉందని, దీనిని 1984లోనే బావి రాజయ్య దగ్గర కొనుగోలు చేశామన్నారు. ఈ భూమికి ఆనుకొని ఉన్న సోదరుడు తమ భూమిలోకి వచ్చి కబ్జాకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. తమకు సిరిసిల్ల కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. తన సోదరుడి కుటుంబీకులు కావాలనే భూమిని ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ఏర్పాటుతోనే అభివృద్ధి



నర్సింగపూర్‌లో పంచాయతీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి(వేములవాడ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని నర్సింగపూర్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలోని రెడ్డి కమ్యూనిటీ భవనం, దళితబంధు యూనిట్ ప్రారంభంతోపాటు మర్రిగడ్డలో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం, రామారావుపల్లిలో డైనింగ్‌హాల్ ప్రారంభం, లింగంపేటలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్, మల్యాలలో పల్లె దవాఖానా నిర్మాణానికి భూమిపూజ చేశారు. చందుర్తిలో ప్రగతి మండల సమాఖ్యకు మంజూరైన యంత్ర పరికరాలను ప్రారంభించారు. నర్సింగపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లలోకి అడుగుపెడుతున్న సందర్భంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లంపల్లి నీటితో వేసవిలో కూడా చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక తాగు, సాగునీటి కష్టాలు దూరమయ్యాయన్నారు. నియోజకవర్గంలో 55 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దళితబంధు తరహాలోనే ప్రభుత్వం బీసీబంధు పథకాన్ని తీసుకొచ్చి ప్రతి లబ్ధిదారునికి రూ.లక్ష ఇచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మీ పథకంలో జూలైలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 56 ఆలయాలకు దూపదీప నైవేద్యం స్కీం మంజూరైందని, ఇంకా 22 గుడులకు త్వరలో మంజూరు చేయిస్తానని తెలిపారు. ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, వేములవాడ కౌన్సిలర్ శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, మాజీ చైర్మన్ దప్పుల అశోక్, సర్పంచ్ గంగాధర్, కమలాకర్‌రావు, దప్పుల లక్ష్మి, గట్టు లక్ష్మీనారాయణ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మాజీ అధ్యక్షుడు మరాఠి మల్లిక్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యుడు పూడూరి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవు మృతి

సిరిసిల్లఅర్బన్: చిన్నబోనాలలో గురువారం వీధికుక్కల దాడిలో ఆవు మృతిచెందింది. గోస్కుల పర్శరాములుకు చెందిన ఆవును ఇంటికి సమీపంలో కట్టి ఉంచాడు. గుంపులుగా వచ్చిన వీధికుక్కలు ఆవుపై దాడి చేయగా ఆవు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆగిన వలసజీవి గుండె



పర్శయ్యగౌడ్ (ఫైల్)

వేములవాడఅర్బన్: బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లిన వలసజీవి గుండె ఆగిపోయింది. వేములవాడ మండలం కొడుముంజకు చెందిన నాగుల పర్శయ్యగౌడ్(55) దుబాయిలో బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. కుటుంసభ్యులకు గురువారం విషయం తెలిసింది. మృతునికి భార్య రాజవ్వ, ఇద్దకు కుమార్తెలు ఉన్నారు.

మందు పంచలేదని ప్రమాణం చేయ్



సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



వేములవాడలో రావణాసురుని దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

- మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత మహేందర్‌రెడ్డి సవాల్
- సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా
- సీఎం ఫ్లెక్సీ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు

సిరిసిల్ల: ఎన్నికల్లో మందు పంచలేదని, పైసలు ఇయ్యలేదని సిరిసిల్ల అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా మంత్రి కె.తారక రామారావు ప్రమాణం చేయాలని కాంగ్రెస్ నేత కె.కె.మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అమలుకాని ఎన్నికల హామీలపై జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ తీశారు. ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనంతో ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకోకుంటే నేరెళ్ల సంఘటన ఎలా జరిగిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో సబ్బండ వర్గాలకు మేలు జరిగిందని పేర్కొన్నారు. మందు పంచను.. పైసలు ఇయ్యను అన్న మంత్రి కేటీఆర్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. నీ పర్యటన ఉన్నప్పుడల్లా కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయ డం అన్ని చూస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేయలే, నిరుద్యోగ భృతి ఇయ్యలే, దళితులకు మూడెకరాలు ఇయ్యలే.. ఇలా చెప్పుకుంట పోతే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆర్డీవో ఆఫీస్ డీఏవో మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ నాయకులు చీటి ఉమేశ్‌రావు, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, కామునివనిత, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, దొమ్మాట నర్సయ్య, సూర దేవరాజు, జాల్గం ప్రవీణ్, మునిగెల రాజు వివిధ పాల్గొన్నారు.

పోలీసులతో తోపులాట

ఆర్డీవో ఆఫీస్ ముందు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సిరిసిల్లటౌన్ సీఐ అనిల్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్ ఫ్లెక్సీ లాక్కోవడంతో తోపులాట జరిగింది. పోలీసులు ఆ ఫ్లెక్సీని లాక్కెళ్లారు. ముందుగా అనుమతి తీసుకున్న ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఐ అనిల్‌కుమార్ కోరారు. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ.. అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. జనవరిలో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వమని ఎవరినీ వదిలి పెట్టబోమని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దశాబ్ది కావవి.. దగా ఉత్సవాలు : డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని.. ప్రజాధనంతో ప్రచారం చేసుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడలోని మూలవాగు వంతెన నుంచి తహసీల్దారు ఆఫీస్ వరకు గురువారం రావణాసురుని చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణచౌక్‌లో రావణాసురుని చిత్రపటాన్ని దహనం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలపాలిట రావణాసురిడిలా మారిన సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని కోరారు. వేములవాడ రాజన్నకు ఇచ్చిన హామీలన్నీ మరచిపోయారన్నారు. సాగారం వెంకటస్వామి, పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, చింతపంటి రామస్వామి, షేక్ ఫిరోజ్‌పాషా, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాయితి నాగరాజు, జెడ్పీటీసీ నాగరాజు, జగన్మోహన్‌రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల కొమురయ్య, ఎల్లయ్య, కత్తి కనకయ్య, ఎర్రం రాజు, సోయినేని కరుణాకర్, పులి సత్యం, తోట లహరి పాల్గొన్నారు.

మద్యం, డబ్బులు లేకుండా ఎన్నికకు సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గంలో డబ్బులు, మద్యం లేకుండా ఎన్నికకు వస్తామని మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. స్థానిక పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్ మాట్లాడిన మాటలపై మహేందర్‌రెడ్డి స్పందించారు. సిరిసిల్ల అంబేడ్కర్ వద్ద అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్నారు. ఇప్పటి వరకు పోలీసులను వాడుకోలేదని మంత్రి చెబుతున్న మాటలకు అర్థం లేదన్నారు. నియోజకవర్గానికి వచ్చినప్పుడల్లా కార్యాకర్తలను పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక మాఫియా, భూకబ్జాలు, ల్యాండ్‌మాఫియాను అనుచరుల చేత నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షంగా బాధ్యతతో డిగ్రీ కళాశాల కోసం అడుగుతున్నామన్నారు. అనంతరం రాచర్లగుండారంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు గ్రామస్తులకు కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, బానోతు రాజు, రాజేందర్, తిరుపతి, శ్రీనివాస్, మల్లయ్య, లింగంగౌడ్, బుచ్చాగౌడ్, రాజు, దేవయ్య, వంగ మల్లారెడ్డి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిలో విద్యుత్ వైరు చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ వైకుంఠధామం పరిసరాల్లో బోరు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైరు చోరీ జరిగినట్లు సర్పంచ్ బూర్గుల నందయ్య గురువారం తెలిపారు. గుర్తుతెలియని దొంగలు విద్యుత్ వైర్లు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీసులకు సమాచారం అందించినట్లు వివరించారు. ఇప్పటికే రెండుసార్లు విద్యుత్ వైరు చోరీ జరిగిందని ఇది మూడోసారి అని సర్పంచ్ నందయ్య తెలిపారు.



అంధకారంలో తెలంగాణ తల్లి

వేములవాడ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లను సుందరంగా అలంకరించుకున్న పాలకులు ఉత్సవాల ముగింపు రోజు మాత్రం తెలంగాణ తల్లి విగ్రహాన్ని అంధకారంలో ముంచేశారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం ఇలా చీకట్లో కనిపించింది.

తీరిన వంతెన కష్టాలు

- నక్కవాగుపై హైలెవల్ బ్రిడ్జి
- ఏళ్ల సమస్యకు పరిష్కారం
- రూ.11.55 కోట్లు మంజూరు



హన్మాజిపేట వద్ద నక్కవాగు

వేములవాడరూరల్: నక్కవాగు పొంగితే చాలా గ్రామాల ప్రజలకు వేములవాడతో సంబంధాలు తెగిపోతాయి. మరికొన్ని గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వేములవాడకు చేరుకుంటుంటారు. కూరగాయల రైతులు, పాలవ్యాపారులు నిత్యం వేములవాడకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటుంటారు. వీరు ఏటా వర్షాకాలం చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం రూ.11.55కోటను వంతెన నిర్మాణానికి మంజూరు చేసింది.

నలభై ఏళ్లకు తీరిన కష్టాలు

వేములవాడరూరల్ మండలంలోని హన్మాజిపేట నక్కవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం రూ.11.55 కోట్లను మంజూరు చేసింది. దాదాపు నలభై ఏళ్లుగా నక్కవాగుపై ఈ ప్రాంత ప్రజలు వర్షాకాలం రాకపోకలకు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ బ్రిడ్జిని నిర్మించాలని హన్మాజిపేట వాసులతోపాటు ఆ ప్రాంత ప్రజలు ఏళ్లుగా ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నారు. అయినప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు నక్కవాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆమేరకు పలుమార్లు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.11.55 కోట్లను మంజూరు చేసినట్లు ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

గ్రామాలకు రాకపోకలు

హన్మాజిపేట వద్ద నక్కవాగు ప్రతి వర్షాకాలం నీటి ప్రవాహంతో పారుతోంది. దీంతో ఈ ప్రాంతంలోని లింగంపల్లి, బొల్లారం, సుద్దాల, కోనరావుపేట మండలంలోని చాలా గ్రామాల ప్రజలు వర్షాకాలం వేములవాడకు రావాలంటే ఇబ్బంది పడేవారు. వర్షాలు కురిసి నక్కవాగు నిండుగా పారితే ఆయా గ్రామాల ప్రజలు సుద్దాల, మర్రిగడ్డ గ్రామాల మీదుగా వేములవాడకు చేరుకుంటుంటారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



నక్కవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో నక్కవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– జంకె విజయ, సర్పంచ్, హన్మాజిపేట

ఇబ్బందులు తొలగనున్నాయి



నిత్యం వ్యవసాయ పనుల కోసం ఈ బ్రిడ్జి నుంచి పనులకు వెళ్తాం. వర్షాకాలంలో బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రైతులం ఇబ్బందులు పడతున్నాం. ఒక్కోసారి మూడు, నాలుగు రోజులు కూడా నీటి ప్రవాహం తగ్గదు. ఈ బ్రిడ్జి నిర్మిస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

– జంకె సత్తయ్య, రైతు, హన్మాజిపేట